సాక్షి మహబూబ్‌నగర్

ఆదివారం । 2 । మార్చి । 2025

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-30 (ఆదివారం సాయంత్రం)
సహర్ 5-13 (సోమవారం తెల్లవారుజామున)



ముగిసిన ఉత్సవాలు
అలంపూర్ క్షేత్రంలో తీర్థావళితో మహాశివ రాత్రి ఉత్సవాలు శనివారం ముగిశాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 34.4 /14.5
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి గాలులు వీస్తాయి.

చివరి అంకానికి..

ఎస్‌ఎల్‌బీసీలో చిక్కుకున్న 8 మంది కార్మికుల అవశేషాల గుర్తింపు

- టీబీఎంకు ఇరువైపులా ఉన్నట్లు గుర్తించిన జీపీఆర్ స్కానింగ్
- నేడు నలుగురు, 2 రోజుల తర్వాత మరో నలుగురు కార్మికులను వెలికి తీస్తారని అంచనా
- సహాయక చర్యలను పరిశీలించిన మంత్రులు ఉత్తమ్, జూపల్లి, సీఎస్ శాంతికుమారి



సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

సాక్షి, నాగర్‌కర్నూల్/అచ్చంపేట రూరల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది కార్మికులను వెలికితీసేందుకు చేపడుతున్న సహాయక చర్యలు చివరి అంకానికి చేరుకున్నట్టు కనిపిస్తోంది. నేడో, రేపో సొరంగం నుంచి కార్మికులను బయటకు తెచ్చే అవకాశాలు ఉన్నాయి. మొదట గుర్తించిన ఒక స్పాట్ నుంచి నలుగురు, ఆ తర్వాత మరో స్పాట్ నుంచి నలుగురు కార్మికులను వెలికి తీసేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నీటి ఊట పెరుగుతుండటం, మట్టి తొలగింపునకు కన్వేయర్ బెల్టు అందుబాటులోకి రాకపోవడంతో ఆలస్యం అవుతోంది. శనివారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి సంఘటన స్థలానికి చేరుకుని, పనులను పర్యవేక్షించారు.

నీటి ఊట, మట్టి తొలగింపుతో పనులు ఆలస్యం.. మొత్తం 13.85 కి.మీ. సొరంగ మార్గంలో 13.61 పాయింట్ వరకు సహాయక బృందాలు చేరుకున్నాయి. మిగతా చోటును గాలించేందుకు అక్కడ సుమారు 18 మీటర్ల మేర పేరుకుపోయిన మట్టి, శిథిలాలు ఆటంకంగా మారాయి. జీపీఆర్ గుర్తించిన చోట తవ్వకాలు జరిపేందుకు సింగరేణి, ర్యాట్ మైనింగ్ టీం రంగంలోకి దిగింది. ఎలాంటి మిషనరీ లేకుండా వారు మ్యానువల్‌గా తవ్వకాలు చేపడుతున్నారు. టీబీఎం సంబంధిన విడిభాగాలు, శిథిలాలను కట్ చేస్తూ ముందుకు సాగుతున్నారు. సహాయక బృందాల రాకపోకలకు, మట్టి, శిథిలాల తరలింపునకు దారిని ఏర్పాటు చేస్తున్నారు. కట్టర్ చివరి భాగంలో కార్మికులు ఉన్నట్టుగా భావిస్తున్న చోట తవ్వకాలు చేపడుతుండగా, పెద్ద ఎత్తున వస్తున్న నీటి ఊటతో అవరోధాలు ఏర్పడుతున్నాయి. నీటిని తోడేందుకు డీవాటరింగ్, మట్టిని తొలగించేందుకు చేపడుతున్న చర్యలతో ఆలస్యం అవుతోంది.

మంత్రులు, సీఎస్ సమీక్ష..

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, ఎమ్మెల్యే వంశీకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో దోమలపెంటకు వచ్చిన మంత్రులు 11.50 గంటలకు టన్నెల్ వద్దకు చేరుకున్నారు. టన్నెల్ లోపల పరిస్థితులను వివిధ శాఖల విపత్తుల అధికారులు వివరించారు. టీబీఎం విడి భాగాలను గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తూనే.. ఊట నీరు, మట్టిని తొలగించే ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

కుటుంబీకుల ఎదురుచూపులు..

పొట్టకూటి కోసం వేలాది కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన ఇతర రాష్ట్రాల కూలీలు, సిబ్బంది ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో పనులు చేస్తూ చిక్కుకున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఎస్‌ఎల్‌బీసీలో జేపీ కంపెనీలో పనులు చేస్తున్నారు. కాగా ఏడు రోజుల నుంచి సొరంగంలో తమ వారు క్షేమంగానే ఉన్నట్లు అధికారులు చెబుతున్నా.. సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల్లో వస్తున్న కథనాలను చూసి సొరంగంలో చిక్కుకున్న వారి బంధువులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. క్షేమంగా బయటపడతారని ఇన్ని రోజులు ఎదురు చూశామని, అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పిన మాటలు భిన్నంగా ఉన్నాయని వాపోతున్నారు. జేపీ కంపెనీ సమీపంలోకి పెద్దఎత్తున పార్థివ అంబులెన్సులు రావడంతో తమవారి ప్రాణాలపై ఆశలు లేవని అర్థమైందని అక్కడికి వచ్చిన బంధువులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

అదనపు మోటార్ల ఏర్పాటు..

సొరంగం సెగ్మెంట్ బిగిస్తుండటంతో ఏర్పడిన రంధ్రాల ద్వారా నీటి ఊట టన్నెల్‌లోకి అధికమైంది. దీంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. ఏర్పాటు చేసిన మోటార్లు సరిపోవడం లేదు. టన్నెల్‌లోకి నీట ఊట అధికమవడంతో ఐదు అదనపు మోటార్లను, ప్రత్యేకంగా పైపులను ఏర్పాటు చేసి.. నీటిని తోడేస్తున్నారు. బురద గట్టి పడటంతో సింగరేణి కార్మికుల వద్ద ఉన్న పారలు సైతం వాడకంలోకి రావడం లేదు. దీంతో అదనంగా గడ్డపారలు తెప్పించారు. పెద్ద పెద్ద డ్రిల్లింగ్ మిషన్లు వాడుతున్నారు. ఊట నీటిని, మట్టిని తొలగిస్తేనే చిక్కుకున్న వారి అవశేషాలు వెలికితీసేందుకు వీలవుతుంది.



అధికారులకు సూచనలు చేస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్

ఆశలు వదులుకున్నా..

సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది ప్రాణాలపై ఆశలు దాదాపు వదులుకున్నట్లేనని ప్రజాప్రతినిధులు చెబుతున్న విషయాలను బట్టి తెలుస్తోంది. చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రభుత్వ అధికార యంత్రాంగం నిష్ణాతులైన రెస్క్యూ టీంలతో సహాయక చర్యలను ముమ్మరం చేసినా ఎలాంటి ఫలితం లేకుండాపోయింది. టన్నెల్‌లో పేరుకుపోయిన బురద, నీటి ఊటలు సహాయక చర్యలకు ఆటంకంగా మారాయని అధికారులు చెబుతున్నా.. ప్రమాదం జరిగిన సందర్భంలోనే చిక్కుకున్న వారి ప్రాణాలు పోయాయని పలువురు చర్చించుకుంటున్నారు.

న్యూస్‌రీల్

ఈ నెలాఖరు వరకు 30 పోలీస్ యాక్ట్: ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని శనివారం నుంచి మార్చి 31 వరకు జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ 1861 అమల్లో ఉంటుందని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్పీ లేదా ఇతర పోలీస్ ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎలాంటి పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు చేయరాదని సూచించారు. నిషేధిత ఆయుధాలు, తుపాకులు, పేలుడు పదార్థాలను వాడరాదని పేర్కొన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదని ఎవరైనా నియమాలను ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం శిక్షర్హులవుతారని హెచ్చరించారు.

రాయితీపై అవగాహన కల్పించాలి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఫీజు చెల్లింపులో ప్రస్తుతం కల్పిస్తున్న 25 శాతం రాయితీపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి శివేంద్రప్రతాప్ ఆదేశించారు. శనివారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ పూర్తిలో తమ పాత్ర కీలకమని అన్నారు. ఈనెల 31వ తేదీలోగా వీలైనన్ని ఎక్కువ దరఖాస్తులను మున్సిపల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. దీనిపై ఎరికైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ నం. 7093911352ను సంప్రదించవచ్చన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఏసీపీ జ్యోత్స్నా దేవి, టీపీఓ లక్ష్మీపతి, టీపీఎస్ విశాల్‌కుమార్ పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.6,989

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్‌లో శనివారం వేరుశనగకు క్వింటాల్ గరిష్టంగా రూ.6,989, కనిష్టంగా రూ.4,590 ధరలు లభించాయి. మినుములు గరిష్టంగా రూ.8,011, కనిష్టంగా రూ.7,670, కందులు గరిష్టంగా రూ.7,060, కనిష్టంగా రూ.4,000, పెబ్బర్లు గరిష్టంగా రూ.5,810, కనిష్టంగా రూ.3,001, మొక్కజొన్న రూ.2,360, పత్తి రూ.6,289 ధరలు పలికాయి. దేవరకద్ర మార్కెట్‌లో క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,041, కనిష్టంగా రూ.5,963గా ధరలు లభించాయి.

నేడు వనపర్తికి సీఎం రాక

- రూ.721 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి
- 'రేవంతన్న కా భరోసా' పథకాన్ని ప్రారంభించనున్న సీఎం



వనపర్తి: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఇందుకుగాను అధికార, పాలకవర్గం భారీఎత్తున ఏర్పాట్లు చేసింది. ఉదయం 11.30 నుంచి సాయంత్రం 4:35 వరకు వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొననున్నారు. హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి 11.30కి జిల్లాకేంద్రంలోని కేడీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకొని స్వామి వారి దర్శనానంతరం ఆలయ అభివృద్ధికి రూ.కోటి ప్రొసీడింగ్ పత్రాలను ఆలయ కమిటీ చైర్మన్ అయ్యలూరి రఘునాథశర్మకు అందజేస్తారు. అటు నుంచి తను విద్యనభ్యసించిన జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానానికి చేరుకొని అక్కడే పాఠశాల, కళాశాల భవన నిర్మాణాలు, జీజీహెచ్ భవనం, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, ఐటీ టవర్, శ్రీరంగాపురం ఆలయ అభివృద్ధి పనులు, పెబ్బేరులో 30 పడకల ఆస్పత్రి భవనం, జిల్లాకేంద్రంలోని రాజనగరం శివారు నుంచి పెద్దమందడి వరకు బీటీరోడ్డు నిర్మాణం, ఎస్టీ హాబిటేషన్ వర్కింగ్ బిల్డింగ్, నియోజకవర్గంలోని సీఆర్‌ఆర్ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని తన పాఠశాల, కళాశాల మిత్రులు, గురువులతో కాసేపు గడిపి వారితో కలిసి భోజనం చేస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2.20కి బయలుదేరి పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించే ప్రజాపాలన ప్రగతిబాట బహిరంగ సభాస్థలికి చేరుకుంటారు. అక్కడే రేవంతన్న కా భరోసా అనే కొత్త పథకాన్ని ప్రారంభిస్తారు. అలాగే వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెక్కులు, కుట్టుమిషన్లు, నియామక పత్రాలు అందజేసిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం 4.35 గంటలకు హెలికాప్టర్‌లో తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరుతారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు హాజరుకానున్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ రావుల గిరిధర్

బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జోగుళాంబ డీఐజీ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా శనివారం జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ముందుగా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ నుంచి జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల వరకు రూట్ బందోబస్తును పరిశీలించారు. సభాస్థలి, సీఎం పర్యటించనున్న ప్రదేశాలు, పైలెట్ వాహనాల ట్రయల్ రన్ నిర్వహించారు. వీఐపీ కాన్వాయ్ వెళ్లే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ ఓపెనింగ్ పార్టీ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో రోడ్లపై చిరు వ్యాపారులు, వాహనాలు నిలుపరాదని ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. బహిరంగ సభకు వచ్చే వాహనాలకు ఆర్టీసీబస్‌డిపోలో పార్కింగ్ సౌకర్యం కల్పించామని.. కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే నిలపాలని సూచించారు. బందోబస్తును మొత్తం ఏడు సెక్టార్లుగా విభజించామని.. నలుగురు ఎస్పీలు, నలుగురు అడిషనల్ ఎస్పీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 21 మంది సీఐలు, 28 మంది ఎస్ఐలు, 140 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 420 మంది కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుల్, 250 మంది హోంగార్డులు విధులు విధులు నిర్వర్తిస్తారని చెప్పారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ క్రైం: బాలికలు జీవితంలో ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకుని ఆ దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని ఎస్పీ డి.జానకి అన్నారు. మండలపరిధిలోని రాంరెడ్డిగూడెంలో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాల(బాలికల)లో శనివారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట కళాశాల ఆవరణలో మొక్క నాటిన ఆమె, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొన్ని బలహీనతలు జీవితాన్ని, లక్ష్యాన్ని తారుమారు చేస్తాయని అలాంటి వాటికి ఆకర్షితులు కావొద్దన్నారు. సమాజంలో మహిళ పాత్ర చాలా గొప్పగా ఉంటుందని, ప్రతి రంగంలో రాణించడానికి కష్టపడాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ అప్పయ్య పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష నిధులను వినియోగించుకోవాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమగ్ర శిక్ష ప్రాజెక్టు, పీఎంశ్రీ ద్వారా జిల్లాలోని పాఠశాలలకు మంజూరైన నిధులను వినియోగించుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో సమగ్ర శిక్ష ప్రాజెక్టు, పీఎంశ్రీ ద్వారా మంజూరైన నిధుల వినియోగం, ఎస్‌ఎస్‌సీ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధం, తదితర విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ప్రాజెక్ట్, పీఎం శ్రీ ద్వారా 2024–25 సంవత్సరానికి పాఠశాల నిర్వహణ, భద్రత, ఆత్మ రక్షణ, యువ, పర్యావరణ క్లబ్‌లు, నిర్మాణ పనుల కోసం మంజూరైన నిధులను వినియోగించుకోవాలన్నారు. టెన్త్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని సూచించారు. పాఠశాలల కిచెన్ షెడ్‌లు, పరిసరాలు పరిశుభ్రతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవికాలంలో తాగునీటి కొరత లేకుండా, టాయిలెట్స్ ఉపయోగం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఈఓ ప్రవీణ్‌కుమార్, కేజీబీవీ ఏఎంఓ శ్రీనివాస్, పరీక్ష విభాగం అసిస్టెంట్ కమిషనర్ కరుణాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- హత్య చేసి కాల్వలో పడేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ
- మృతుడి భార్య పైనే అనుమానం..?


రహ్మతుల్లా(ఫైల్)

పాన్‌గల్: కేఎల్‌ఐ కాల్వలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన శనివారం పాన్‌గల్ చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన ఎండీ రహ్మతుల్లా(44) పెయింటింగ్, మటన్ కట్టింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున 4గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంటికొచ్చి పొట్టేలు కోసేది ఉందని తీసుకెళ్లాడు. ఉదయం 7.30 సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని కేఎల్‌ఐ కాల్వలో శవమై కనిపించాడు. స్థానికులు కాల్వలో శవం ఉన్న విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలికి చేరుకొని కాల్వ నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువు జాఫర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి శరీరంపై గాయాలు ఉండటంపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ మృతుని హత్య చేసి కాల్వలో పడేశారని ఆరోపించారు. మృతుని భార్యపైనే అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. విచారిస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు ..


శ్రీకాంత్(ఫైల్)

దేవరకద్ర: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కొకుంట్ల మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్(25), లింగేష్‌లు స్కూటీపై దేవరకద్రకు వస్తుండగా ఎదురుగా టిప్పర్ రావడంతో ప్రమాద వశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శ్రీకాంత్ శనివారం మృతి చెందగా లింగేష్ పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంకర్ ఢీకొని ఒకరు..


- ఆరుగురికి తీవ్రగాయాలు

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై ఆటోను వెనుక నుంచి ట్యాంకర్ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. కోదండాపురం ఎస్‌ఐ మురళీ తెలిపిన వివరాలు.. కర్నూల్ జిల్లాలోని క్రిష్ణగిరి మండలం తాళ్ల గోకులపాడుకు చెందిన దూదేకుల నబి సాహెబ్ (53) అదే గ్రామస్తుడు జుబేర్‌కి చెందిన ఆటోలో మరో ఎనిమిది మందితో కలిసి శనివారం తెల్లవారుజామున పెబ్బేరు సంతకు బయలుదేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేముల స్టేజీ సమీపంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ట్యాంకర్ అతివేగంతో వెనుక నుంచి వచ్చి ఆటోను ఢీకొట్టి పారిపోయాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి నబిసాహెబ్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆటో డ్రైవర్ జుబేర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి ..

తాడూరు: బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి అదుపు తప్పడంతో మృతి చెందిన సంఘటన తాడూరు మండలం ఇంద్రకల్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురుసస్వామి కథనం ప్రకారం.. ఇంద్రకల్ గ్రామానికి చెందిన మల్లేష్(38) మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలేద్దరాడు. గ్రామసమీపంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు గాయపడిన మల్లేష్‌ను జిల్లా ఆస్పత్రికి తరలించగా... అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాము కాటుతో మరొకరు..


శాంతయ్య(ఫైల్)

తిమ్మాజిపేట: మండలంలోని గొరిట గ్రామానికి చెందిన బర్ల శాంతయ్య(52) పాము కాటుకు గురై మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. శుక్రవారం వ్యవసాయ పొలానికి వెళ్లిన శాంతయ్య పాము కాటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య బద్రమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

అలంపూర్‌లో ముగిసిన ఉత్సవాలు


ఆదిదంపతులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

- శేషవాహనంపై ఊరేగిన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి
- వసంతోత్సవంలో అర్చకులు, భక్తుల సంబురాలు

అలంపూర్: అలంపూర్ క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలు తీర్థావళితో ముగిశాయి. చివరిరోజు ఉదయం ఆలయంలో నిత్య పూజా హోమాలు, బలిహరణం నిర్వహించారు. అనంతరం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి శేషవాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి శేషవాహన సేవను ప్రారంభించగా


శేష వాహనంలో ఊరేగుతున్న జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి

ఆది దంపతులు ఆలయ వీధుల్లో విహరించారు. భక్తులు అడుగడుగున స్వాగతం పలుకుతూ కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పూర్ణాహుతితో పూజలు పరిసమాప్తం..

యాగశాలలో రుద్రహోమాలు, కుష్మాండ బలిహరణం, ఆలయం చుట్టూ ఉత్సవ బలిభేరితో అష్టదిక్పాలకుల బలిహరణం నిర్వహించారు. అవాహిత దేవతా మండపాలకు ప్రత్యేక పూజలు, నివేదనలు చేసిన ద్రవ్యాలతో పూర్ణాహుతి, కలశ ఉద్వాసన జరిగాయి. పూర్ణాహుతితో ఉత్సవ పూజలు ముగిశాయని ఈఓ ప్రకటించారు.

వసంతోత్సవం..

ఉత్సవాల ముగింపు సందర్భంగా వసంతోత్సవాన్ని ఆనందంగా జరుపుకొన్నారు. అర్చకులు, అధికారులు, భక్తులు, సిబ్బంది ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొన్నారు.

ధ్వజ అవరోహణం..

మహాశివరాత్రి ఉత్సవాలు ధ్వజ అవరోహణంతో సంపూర్ణమయ్యాయి. ఉత్సవాల ముగింపులో భాగంగా ఆలయ ప్రాంగణంలోని ధ్వజాన్ని కిందికి దించారు. ముందుగా ఈఓ, చైర్మన్ ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆగమోక్తంగా క్రతువు నిర్వహించి ధ్వజ అవరోహణం చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో గర్భాలయానికి చేర్చి మహా నివేదన, దశవిధ హారతులిచ్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామస్తులను ఆలయానికి ఆహ్వానించి అన్నదానం చేశారు. ఉత్సవాలను విజయవంతం చేసిన వివిధ శాఖల అధికారులు, పోలీసులు, అర్చకులు, సిబ్బంది, పుర ప్రజలకు చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఈఓ పురేందర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

నాగకన్యల బావిలో..

బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయ సముదాయంలో ఉన్న నాగకన్యల బావిలో తీర్థావళి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకీలో మంగళవాయిద్యా నడుమ నాగకన్యల బావి వద్దకు తీసుకెళ్లారు. ముందుగా దేవతామూర్తులకు మృతిక స్నానం, పంచామృతాలతో అభిషేకం చేశారు. అర్చకులు పంచసూక్తాలు పఠిస్తూ నాగకన్యల బావిలోని నీటితో అభిషేకించారు. మహిళలు పాలికలను బావిలో వదిలారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలను బావిలోకి తీసుకెళ్లి పుణ్యస్నానాలు చేయించారు. అనంతరం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.


నాగకన్యలబావిలో స్వామి, అమ్మవార్ల పుణ్యస్నానాలు

సెల్‌ఫోన్ ఇవ్వలేదని మహిళ హత్య


మహిళ హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణ

- మూడు రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు

భూత్పూర్: మునిరంగస్వామి ఆలయం సమీపంలో గత నెల 26న కొత్తమొల్గర గ్రామానికి చెందిన అనగాళ్ల రంగమ్మ(50) హత్యకు గురైంది. శనివారం సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ చంద్రశేఖర్‌తో కలిసి సీఐ రామకృష్ణ ఈ కేసు వివరాలు వెల్లడించారు. సెల్‌ఫోన్ ఇవ్వలేదని తాగిన మైకంలో మహిళను హత్య చేసినట్లు భూత్పూర్‌కి చెందిన గడ్డం రాజు విచారణలో తెలిపాడు. మునిరంగస్వామి జాతర సందర్భంగా గతనెల 19న కొత్తమొల్గరకి చెందిన రంగమ్మతో పరిచయమైంది. దీంతో వారిమధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఈ నేపథ్యంలో రాజు తన సెల్‌ఫోన్‌ను ఆమెకు ఇచ్చాడు. 25వ తేదీ రాత్రి రంగమ్మను జాతరలో కలిసి సెల్‌ఫోన్ ఇవ్వాలని పట్టుబడ్డాడు. డబ్బులు ఇస్తేనే సెల్‌ఫోన్ ఇస్తానని ఆమె చెప్పడంతో ఇద్దరూ కలిసి మద్యం సేవించి ఆలయం సమీపంలోనే నిద్రపోయారు. 26వ తేదీ తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో రాజు నిద్రలేచి రంగమ్మ తలపై, కాళ్లపై బండరాళ్లతో కొట్టి చంపాడు. కొనప్రాణంతో కొట్టిమిట్టాడుతుండగా గమనించిన ఆలయ పూజారి ఎస్‌ఐ ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలిలో పోలీసులకు సెల్‌ఫోన్ లభించడంతో విచారణ చేపట్టారు. గడ్డం రాజుకు చెందిన సెల్‌ఫోన్ కావడంతో శనివారం భూత్పూర్ చౌరస్తాలో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా తానే హత్య చేసానని నేరం ఒప్పుకున్నాడు. రాజుపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. మూడు రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులను సీఐ ప్రశంసించారు.

యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సదరం గుర్తింపు కార్డు కోసం యూడీఐడీ (యూనిక్ డిజాబ్లిటీ ఐడీ) పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సీఈఓ దివ్య దేవరాజన్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరం ధ్రువీకరణ పత్రాల కోసం యూడీఐడీ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేలా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కోసం మీసేవ, వీఎల్ఈ కేంద్రాలను ఆశ్రయించేవారని, ఇప్పుడు వీటితోపాటు యూడీఐడీ పోర్టల్, స్వంత మొబైల్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్, స్లాట్లు చేసుకోవచ్చని తెలిపారు. 21 రకాల వైకల్యం కలిగిన వారు యూడీఐడీ (యూనిక్ డిజాబ్లిటీ ఐడీ) కార్డును పొందవచ్చని ఆమె తెలిపారు. రాష్ట్రంలో సదరం క్యాంపులను నిర్వహించేందుకు 38 మెడికల్ బోర్డులను గుర్తించామన్నారు. సదరం క్యాంప్‌లో దివ్యాంగులకు అసౌకర్యం కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్‌డీఓ నర్సింహులు, జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం, డీపీఎం కృష్ణయ్య పాల్గొన్నారు.

లింక్ క్లిక్ చేస్తే రూ.93వేలు మాయం

జడ్చర్ల: టెలిగ్రాంకు వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగానే రూ.93వేలు బ్యాంక్ ఖాతాల నుంచి మాయమైనట్లు సీఐ కమలాకర్ తెలిపారు. వివరాలు.. సరస్వతీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న గొల్లపల్లి గ్రామానికి చెందిన హర్షవర్ధన్ టెలిగ్రాంకు కొన్ని నెలల క్రితం లింక్ వచ్చింది. వాటిని క్లిక్ చేయగానే అతడి రెండు ఖాతాల్లో డబ్బులు మాయం అయ్యాయి. దీని గమనించి శనివారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


టైలరింగ్ సర్టిఫికెట్లు అందజేస్తున్న మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం అక్బర్ అండ్ సన్స్ హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీజీఎంఎఫ్‌సీ నిరుద్యోగ మైనార్టీల కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. యువత, మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి కల్పనకు శ్రీకారం చుడుతామని అన్నారు. ఆదివారం వనపర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం చేపడుతామన్నారు. మొదటి విడతగా 10,490, రెండో విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 31,740 కుట్టుమిషన్లను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్, ఓవర్‌సీస్ కన్వీనర్ అక్బర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, ఎంఐఎం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హాదీ, కాంగ్రెస్ నాయకులు చంద్రకుమార్‌గౌడ్, మహ్మద్ ఫయాజ్, అజ్మత్‌అలీ, అవేజ్ అహ్మద్, జహీర్, పీర్ సాధిక్, షాఫైసల్ పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో మళ్లీ హింసాత్మక ఘటనలు


గాయపడిన రవికృష్ణనాయక్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

- డీజీపీ, ఐజీలు దృష్టి సారించాలి
- మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: రెండు దశాబ్దాలుగా ప్రశాంతంగా ఉన్న కొల్లాపూర్‌లో మళ్లీ హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయని మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిలో గాయపడిన రవికృష్ణ నాయక్‌తో పాటు అతని కుటుంబీకులను పరామర్శించారు. అంతకు ముందే రవికృష్ణ నాయక్ కుటుంబీకులు కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసు బందోబస్తుతో మెడికల్ చెకప్ కోసం వారిని తిరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రి వద్ద బాధితులను పరామర్శించి.. దాడిలో ధ్వంసమైన కారును హర్షవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో కూడా రవికృష్ణ కుటుంబంపై తండాలో దాడి జరిగగా తానే స్వయంగా ఎస్పీని కలిసినా కేసు నమోదు చేయలేదన్నారు. తాజాగా మరోసారి హత మార్చేందుకు తెగబడ్డారని, కొల్లాపూర్ నడిబొడ్డున మారణాయుధాలతో దాడి చేసేంత ధైర్యం వారికి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. దాడులకు పాల్పడిన వారిని వదిలిపెట్టి బాధితులపైనే పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని, ప్రతిపక్షాలు కేసులు పెడితే వాపస్ తీసుకోమని బెదిరిస్తున్నారని ఆరోపించారు. కొల్లాపూర్ ఘటనలపై డీజీపీ, ఐజీలు దృష్టిపెట్టాలని కోరారు. రవికృష్ణ కుటుంబానికి పార్టీ తరపున చికిత్స చేయిస్తామని హామీ ఇచ్చారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కోడేరు ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు కిషన్ నాయక్, నరేందర్‌రెడ్డి, సాంబశివుడుయాదవ్, శ్రీనివాసులు, రామచందర్‌యాదవ్, కాటం జంబులయ్య, శంకర్‌నాయక్ తదితరులున్నారు.

హుండీ ఆదాయం రూ.5.38 లక్షలు

జడ్చర్ల టౌన్: మీనాంబరం పరుశవేదీశ్వర స్వామి ఆలయంలో శనివారం హుండీ లెక్కించగా రూ.5,38,070 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి వీణాదరి తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఈ ఆదాయం వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. హుండీ లెక్కింపులో ఆలయ అర్చకులతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాల నియంత్రణ

మహబూబ్‌నగర్ క్రైం: అప్రమత్తతతో పాటు సరైన అవగాహన ఉంటే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరం జరిగిన మొదటి గంట గోల్డెన్ అవర్ అని.. ఆ సమయంలో ఫిర్యాదు చేస్తే లావాదేవీలు నిలిపి, పోయిన డబ్బును తిరిగి రాబట్టడం సులభమవుతుందని పేర్కొన్నారు. సైబర్ నేరానికి గురైన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930 కాల్ చేయడం, cybercri-me.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇటీవల వన్‌టౌన్ పరిధిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి నుంచి రూ.84 లక్షలు, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.20 లక్షల రుణం మంజూరైందని చెప్పి ఓ వ్యక్తి నుంచి రూ.80 వేలు, జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.4.29 లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేశారని వివరించారు. సైబర్ బారిన పడకుండా ఉండాలంటే ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయరాదని, బ్యాంకు వివరాలు, ఓటీపీ ఎవరికి చెప్పొద్దని సూచించారు. లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు.

నేడు, రేపు కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశాలు

మహబూబ్‌నగర్ రూరల్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర స్థాయి సమావేశాలు ఆది, సోమవారాల్లో జిల్లా కేంద్రంలోని అరుంధతిభవన్‌లో నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యంరాజు, కార్యదర్శి ఎం.కుర్మయ్య శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా ఈ సెమినార్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి రోజు సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్ర స్థాయి సెమినార్‌లో యువకులు, విద్యార్థులు, విద్యావంతులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి ఉపవాస దీక్షలు


జిల్లా కేంద్రంలోని రహెమానియా ఈద్గా

- నెలవంక దర్శనంతో రంజాన్ మాసం ప్రారంభం
- దివ్యఖురాన్ అవతరించిన పవిత్రమాసం

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం శనివారం రాత్రి నెలవంక దర్శనమివ్వడంతో ప్రారంభమైంది. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం 9వ మాసమైన రంజాన్ ప్రారంభ సూచికంగా మసీదుల్లో సైరన్‌లు మోగాయి. ముస్లింలు ఉపవాసాలను ఆదివారం తెల్లవారు జామున నుంచి ప్రారంభించారు. ప్రత్యేక ప్రార్థనలకు మసీదులన్నీ ముస్తాబయ్యాయి. రంజాన్ నెలలోనే పవిత్ర గ్రంథం దివ్య ఖురాన్ న్ అవతరించిందని ఇస్లాం మతస్తుల ప్రగాఢ నమ్మకం. ఉపవాస దీక్షలు ప్రతి ముస్లింపై విధిగా నిర్ణయమై ఉన్నాయని ఖురాన్‌లో పేర్కొనడం వల్ల ప్రాపంచిక జ్ఞానం తెలిసిన వారందరూ ఉపవాస దీక్షలు ఉంటారు. ఇంత పవిత్రమైన ఈనెలలో చేసే ప్రతి పుణ్యకార్యానికి డెబ్బై రెట్ల ప్రతిఫలం లభిస్తుందని విశ్వసిస్తారు. ఉపవాస దీక్షల (రోజా) వల్ల దైవభీతి, పాపభయం జనిస్తుందని దైవవాణి పేర్కొనడంతో ముస్లిం అత్యంత భక్తి ప్రపత్తులు, కఠోర ఉపవాస దీక్షలను పాటిస్తారు.

రంజాన్ ఉపవాస దీక్ష విశేషాలు

పవిత్ర రంజాన్‌లో 30 రోజులు ఉపవాస దీక్షలు పాటించాలి. సూర్యోదయం కంటే ముందే నిర్ధారిత సమయంలో ఆహార పానీయాలు తీసుకోవాలి, దీనిని 'సహర్' అంటారు. సూర్యాస్తమ సమయంలో ప్రతి రోజు కొన్ని నిమిషాల తేడాతో ఉపవాస దీక్ష విరమణ నిర్ధేశించమైనది, దీనిని 'ఇఫ్తార్ ' అంటారు. ఖర్జూరం తదితర పండ్లతో ఉపవాస దీక్ష విరమిస్తారు. ఉపవాస దీక్ష సమయంలో విధిగా నమాజులు చేయాలి. అపవిత్రమైన చర్యల వల్ల ఉపవాస దీక్ష లక్ష్యం దెబ్బతింటుంది. ఏ వ్యక్తి అయితే రంజాన్ నెలలో ఉపవాసం ఉంటాడో అతడు చేసిన పాపాలన్నీ క్షమింపబడుతాయన్నది నమ్మకం. రంజాన్ దీక్షలు నరకాగ్ని నుంచి కాపాడుతుందని హదీస్ చెబుతుంది. ఉపవాసంతో ఉండి చేసే ప్రార్థనను అల్లాహ్ (దైవం) ఎప్పుడు తిరస్కరించదని చెబుతారు.

తరావీహ్ నమాజ్

రంజాన్ మాసంలో ఉపవాసంతోపాటు ప్రత్యేక తరావీహ్ నమాజ్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. మసీదుల్లో హాఫిజ్‌లు ఖురాన్‌ను పఠిస్తారు. శనివారం రాత్రి నుంచి నెలరోజుల పాటు ప్రతిరోజు రాత్రివేళ మసీదుల్లో 20 రకాతుల తరావీహ్ నమాజ్ ప్రార్థనలు చేస్తారు. కొన్ని మసీదుల్లో పది రోజులపాటు ప్రతి రోజు ఖురాన్‌లోని మూడు పారాలు పఠించడానికి ఏర్పాటు చేశారు.

హలీం, హరీస్ రుచులు

రంజాన్ మాసంలో లభించే హలీం, హరీస్ వంటకాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కేవలం ఈ మాసంలో లభించే ఈ వంటకాలను ఆరగించడానికి కులమతాలకతీతంగా ప్రజలు ఆసక్తి కనబరుస్తారు. ఇప్పటికే వీటి తయారీకి సంబంధించిన మట్టితో కూడిన బట్టీలు సిద్ధం చేశారు. పలుచోట్ల రెండు రోజుల నుంచే హలీం, హరీస్ అమ్మకాలు ప్రారంభమయ్యాయి.



జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన హరీస్ దుకాణం

ఆర్టీసీకి శివరాత్రి ఆదాయం రూ.88.98లక్షలు

- మూడు రోజుల పాటు శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు
- 54వేల మంది ప్రయాణం

స్టేషన్ మహబూబ్‌నగర్: మహాశివరాత్రి పండుగ రోజుల్లో మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు మెరుగైన ఆదాయం వచ్చింది. గత నెల 25, 26. 27 తేదీల్లో శ్రీశైలం వరకు రీజియన్‌లోని తొమ్మిది డిపోల నుంచి 271 ప్రత్యేక బస్సులను నడిపారు. ఈమూడు రోజుల్లో రీజియన్‌కు 129 శాతం ఆక్యుపెన్సీ రేషియో రాగా 54343 మంది ప్రయాణం చేశారు. మూడు రోజుల్లో ఆర్టీసీ రీజియన్‌కు రూ.88,98,042 లక్షల ఆదాయం వచ్చింది. మహబూబ్‌నగర్ డిపోకు అధికంగా రూ.24,51,280ల ఆదాయం సమకూరింది.


శివరాత్రికి సంబంధించి మహబూబ్‌నగర్ డిపో నుంచి ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సు(ఫైల్)

గతనెల 25 నుంచి 27 వరకు రీజియన్ ఆదాయం వివరాలు

డిపో	బస్సులు	ఆదాయం	ఓఆర్	ప్రయాణికులు
మహబూబ్‌నగర్	83	24,51,280	133	12697
వనపర్తి	35	10,37,160	112	5321
నారాయణపేట	38	9,53,352	110	5088
అచ్చంపేట	24	9,09,775	147	7765
నాగర్‌కర్నూల్	26	8,97,460	144	3963
గద్వాల	22	7,62,515	131	4487
కొల్లాపూర్	21	7,47,030	124	6270
కల్వకుర్తి	21	6,91,050	139	4993
షాద్‌నగర్	11	4,48,420	125	3759

